క్లుప్తంగా

గురుకుల పాఠశాల తనిఖీ



పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అఖిలప్రియ

ఆళ్లగడ్డ: స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల (ఆర్‌పీఆర్‌పీ) పాఠశాలను ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలతో పాటు భోజనశాల, తరగతి గదులు, వసతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. ఏమైన సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఆవరణలో పారిశుద్ధ్యం లోపం లేకుండా చూడాలని ప్రిన్సిపాల్ సంధ్యకు సూచించారు. పాఠశాలలో నీటి సమస్య ఉందని తెలియడంతో పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబును ఆదేశించారు.

18న మండల మీట్

దొర్నిపాడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 18వ తేదీ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని కోరారు.

కౌలు రైతుల వివరాలు సక్రమంగా నమోదు చేయండి

గోస్పాడు: కౌలు రైతుల వివరాల నమోదును సక్రమంగా చేపట్టాలని తహసీల్దార్ భార్గవి, వ్యవసాయాధికారి స్వప్నికారెడ్డి సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్‌ఓలు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కౌలు రైతులకు కౌలు గుర్తింపు కార్డులు ప్రభుత్వం అందజేస్తుందన్నారు. మండలానికి 1,622 సీసీఆర్‌సీ కార్డులు ఇవ్వాలని లక్ష్యం నిర్దేశించారన్నారు. అర్హత ఉన్న కౌలు రైతుకు గుర్తింపు కార్డు అందేలా సిబ్బంది చొరవ చూపాలన్నారు. డీటీ విజయశేఖర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యత అంశాలపై డీఆర్‌డీఏ అధికారుల సమీక్ష



మాట్లాడుతున్న రవీంద్రకుమార్

నంద్యాల(న్యూటౌన్): స్థానిక డీఆర్‌డీఏ జిల్లా కార్యాలయంలో సోమవారం డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ మురళీ కల్యాణి అధ్యక్షతన ప్రాజెక్టు ప్రాధాన్యత అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ, ఇన్‌స్టిట్యూషన్, బిల్డింగ్, స్త్రీనిధి, ఉన్నతి, జీవనోపాదులు తదితర అంశాల గురించి వివరించారు. బీపీఎం ఐబీ ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య, ఇండస్ట్రీయల్ ప్రమోషన్ ఆఫీసర్ చంద్రశేఖర్‌రావు, కో ఆర్డినేటర్ ఎల్లయ్య పాల్గొన్నారు.


యూనిఫాం అందజేత

ఉయ్యాలవాడ: స్టూడెంట్ కిట్‌లో భాగంగా పాఠశాలలకు మంజూరైన యూనిఫాంను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేసినట్లు ఎంఈఓ వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. మండలానికి 2,077 యూనిఫారం దుస్తులు, 10వ తరగతికి సంబంధించిన ఫిజికల్ పాఠ్యపుస్తకాలు 336 వచ్చాయన్నారు. వీటిని కూడా విద్యార్థులకు అందజేయనున్నట్లు చెప్పారు.

పంప్‌హౌస్ కూల్చివేతపై ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న మాజీ ఉప సర్పంచ్



సర్వాయిపల్లెలో ఎంప్ హౌస్‌ను నేలకూల్చిన స్థలం

ఉయ్యాలవాడ: సర్వాయిపల్లె గ్రామంలో 40 ఏళ్ల క్రితం మంచినీటి సరఫరా నిమిత్తం పంప్ హౌస్ ఏర్పాటు చేశారు. ఆ స్థలం తమదంటూ గ్రామానికి చెందిన రామమోహన్‌రెడ్డితో కలిసి కొందరు పంప్‌హౌస్‌ను నేలకూల్చారని మాజీ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత అవుల రాఘవేంద్రారెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, ఈఓపీఆర్డీ మహిధర్‌రెడ్డిలకు వివరించారు. గతంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్మించిన పంప్‌హౌస్‌ను ఇప్పుడు తొలగించడంలో ఆంతర్యమేమిటని రాఘవేంద్రారెడ్డి ప్రశ్నించారు. స్పందించిన ఎంపీడీఓ పడగొట్టిన స్థలాన్ని పరిశీలించి కలెక్టర్‌కు నివేదిక పంపుతామన్నారు.

చిన్న, చిన్న పనులు చేసుకుంటున్నా



మాది పేద కుటుంబం. నాన్న హుసేన్‌వలి నా చిన్నతనంలోనే మృతి చెందాడు. అమ్మ నజీమూన్ వ్యవసాయ కూలీగా ఉంటుంది. నేను బీఎస్సీ కంప్యూటర్స్ నంద్యాలలోనే అభ్యసించా. ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తూ విధి లేని పరిస్థితిలో చికెన్ సెంటర్, గోబీ సెంటర్లతో పాటు పెయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నా. ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇస్తానని ప్రకటించి ఇప్పటి వరకు చర్యలు చేపట్టలేదు. వెంటనే అమలు చేసి నిరుద్యోగులను ఆదుకోవాలి.

– షేక్‌మహబూబ్‌బాషా, ఫరూక్‌నగర్, నంద్యాల

నిరుద్యోగులను ఆదుకోవాలి



మాది నంద్యాల మండలం చాపిరేవుల గ్రామం. అమ్మానాన్నలు వ్యవసాయ కూలీలు. చిన్నప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందులతో బీఏ వరకు చదివా. ఉద్యోగాల కోసం అనేక ప్రయత్నాలు చేసి చివరకు హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్‌లో నంద్యాలలో ఏజెంట్‌గా పని చేస్తున్నా. అందులో వచ్చే వేతనంతోనే కుటుంబానికి ఆసరాగా ఉంటున్నా. ఉద్యోగం వస్తుందని తల్లిదండ్రులకు నచ్చజెబుతూ ప్రయత్నాలు చేస్తున్నా. చంద్రబాబు నిరుద్యోగ భృతి ఇస్తే కుటుంబానికి కొంతవరకు ఆసరాగా మారుతుంది.

– ఎస్.శివ, బీఏ, చాపిరేవుల, నంద్యాల(మం)

నిరుద్యోగ భృతితో కుటుంబాలకు ఆసరా



నంద్యాల నేషనల్ కళాశాలలో మూడేళ్ల క్రితం బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశా. అమ్మానాన్నలకు వ్యవసాయమే ఆధారం. ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ ప్రస్తుతం పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్నా. అర్హులైన వారందరికీ భృతి ఇస్తామంటూ ప్రభుత్వం ప్రకటించి నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించింది. అయితే ఇప్పటి వరకు అమలుకు పూనుకోకపోవడం సరి కాదు. భృతి అందజేస్తే పేదల కుటుంబాలకు కొంత వరకు ఊరట లభిస్తుంది.

–షేక్ అక్బర్‌వలి, బాపూజీనగర్, నంద్యాల

భృతి భ్రాంతియేనా..!

- ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేలు ఇస్తామని హామీ
- అధికారంలోకి వచ్చి నెల దాటినా ఊసే ఎత్తని కూటమి ప్రభుత్వం
- ఉచిత ఇసుక, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు మాదిరిగానే దీని పరిస్థితి
- గతంలోనూ రూ.2 వేలు ఇస్తానని మాట తప్పిన చంద్రబాబు
- భృతి వస్తుందని స్టడీ సెంటర్లలో చేరిన యువత
- ఈసారి తమ జీవితాలతో చెలగాటమాడొద్దంటూ ఆక్రోశం
- నియోజకవర్గంలో 92,526 కుటుంబాలు ఎదురుచూపులు

20 లక్షల ఉద్యోగాలు రావాలంటే.. మరోసారి బాబు రావాలి. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి నెలా రూ.3 వేలు 'నిరుద్యోగ భృతి' అందుకోవాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలి.. అని ఎన్నికల ముందు కూటమి నాయకులు ఊదరగొట్టారు. కొత్త ఉద్యోగాల సృష్టి దేవుడెరుగు.. ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన 'నిరుద్యోగ భృతి' పై నెల రోజులైనా నోరు మెదపకపోవడంతో నమ్మి ఓట్లేసిన వారికి పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికే 'ఉచిత ఇసుక'.. 'తల్లికి వందనం'.. పథకాల అమలుపై నాలుకమడతపెట్టిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్‌లోని మరో ప్రతిష్టాత్మకమైన పథకం 'నిరుద్యోగ భృతి' అమలును గాలికొదిలేసినట్లే కనిపిస్తోంది. దీంతో నిరుద్యోగులు తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురవుతున్నారు.



ఆళ్లగడ్డ/నంద్యాల(అర్బన్): ఎన్నికల సమయంలో చంద్రబాబు తనయుడు లోకేష్ బాబు చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా ఊరూరు తిరుగుతూ తాము అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తాం. ఉద్యోగం వచ్చే వరకు ప్రతి ఒక్కరికీ నెలకు రూ. 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి అందజేస్తామని చెబుతూ కరపత్రాలు పంచుతూ పోయారు. తెలుగుదేశం, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోగా సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల హామీని ప్రకటించింది. అందులో నిరుద్యోగులకు పెద్ద పీట వేస్తున్నట్లు పేర్కొంది. ప్రధానమైన హామీగా 'నిరుద్యోగ భృతి' పథకం ను పెట్టడంతో పాటు ఎలా ఉంది తమ్ముళ్లూ అంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు ఊదరగొట్టారు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల రోజులు దాటినా ఆ ఊసే ఎత్తట్లేదు.

అదే బాబు నైజం

చంద్రబాబు నాయుడు గతంలో మూడుసార్లు సీఎంగా పనిచేశారు. మళ్లీ బూటకపు హామీలతో నాలుగోసారి గద్దెనెక్కారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో చెప్పింది చెప్పినట్లు అమలు చేసిన చరిత్ర ఆయన డిక్షనరీలోనే లేదు. ఇలాంటి పరిస్థితుల్లో యువత పెద్ద సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు వస్తాయని.. కాకుంటే ఉపాధి దొరికేవరకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తారు కదా అని నమ్మి ఓట్లు వేసింది. ఇప్పుడు ఆశతో ఎదురు చూస్తోంది. చంద్రబాబుతో పాటు పవన్ కల్యాణ్, బీజేపీ కూడా ఉంది కదా.. కచ్చితంగా అమలు చేస్తారని ఆశించింది. డీఎస్సీ వస్తుందనే నమ్మకంతో గ్రామాల్లో పనులు మానుకుని స్టడీ సెంటర్లలో చేరి హాస్టళ్లలో ఉండేందుకు పట్టణ బాట పడుతున్నారు.

ఆశ.. అడియాసేనా..?

ఆళ్లగడ్డ నియోజవర్గ పరిధిలోని ఆళ్లగడ్డ మున్సిపాలిటీతో పాటు ఆరు మండలాల పరిధిలో 92,526 మంది నిరుద్యోగ యువత ఉన్నారు. వీరిలో డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ తదితర కోర్సులు పూర్తి చేసిన వారితోపాటు ఇంటర్, 10వ తరగతి చదివి పోలీస్, ఆర్మీ, నేవీ, రైల్వే తదితర ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగాల కోసం పట్టణాల్లో శిక్షణ తీసుకుంటున్నారు. వీరంతా నిరుద్యోగ భృతి కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో నిరుద్యోగుల వివరాలు

మండలం	నిరుద్యోగులు	అందాల్సిన భృతి నెలకు
ఆళ్లగడ్డ రూరల్/టౌన్	25604	రూ.7,68,12,000
చాగలమర్రి	16059	రూ.4,81,77,000
రుద్రవరం	15451	రూ.4,63,53,000
శిరివెళ్ల	18516	రూ.5,55,48,000
ఉయ్యలవాడ	8420	రూ .2,52,60,000
దొర్నిపాడు	8476	రూ .2,54,28,000
మొత్తం	92526	రూ.27,75,78,000

నిరుద్యోగుల ఊసే లేదు



ఎన్నికల ముందు ఆరు నెలల నుంచే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 20 లక్షల ఉద్యోగాలు భర్తీ, ఉద్యోగం వచ్చేవరకు రూ.3 వేలు అని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. దీంతో తొలి సంతకం నిరుద్యోగుల సమస్య పరిష్కారంపైనే ఉంటుందని ఆశపడ్డా. డిగ్రీతో పాటు టీటీసీ పూర్తి చేశాను. నిరుద్యోగ భృతి వస్తే కోచింగ్ సెంటర్‌లో చేరి డీఎస్సీకి ప్రిపేర్ అవ్వాలని ఎదురు చూస్తున్నా. అయితే ప్రభుత్వం ఏర్పడి నెలరోజులైనా నిరుద్యోగుల ఊసే ఎత్తడంలేదు. అస్సలు నిరుద్యోగ భృతి అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందా లేదా అనే అనుమానం వస్తోంది.

–స్వాతి, క్రిష్టిపాడు

తక్షణం భృతి ఇవ్వాల్సిందే



నేను 2016లో బీటెక్ పూర్తి చేశాను. సరైన ఉపాధి అవకాశాలు లేక ఇంటి వద్దనే ఉంటున్నాను. ఎన్నికల హామీలో రూ.3వేల నిరుద్యోగ భృతి ఇస్తామని టీడీపీ, జనసేన మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ జాబ్‌కోసం ప్రయత్నం చేస్తున్నాను. తక్షణం నిరుద్యోగ భృతి ఇచ్చి ఆదుకోవాలి.

–రవిక్రిష్ణ, శిరివెళ్ల

ఎప్పుడు ఇస్తారో ప్రకటించాలి



నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలి. 20 లక్షల ఉద్యోగాల భర్తీకి సంబంధించి జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయాలి. అంతవరకు చెప్పిన ప్రకారం నిరుద్యోగులకు రూ.3వేలు తక్షణమే అమలు చేయాలి. గతంలోలా ప్రభుత్వం యూటర్న్ తీసుకోకుండా నిరుద్యోగులను ఆదుకోవాలి. 45 ఏళ్ల వరకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. అయితే 35లోపు వారికే ఇస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వం ఉద్యోగ వయోపరిమితిని అనగుణంగా భృతి అందించేలా సడలింపు చేయాలి.

–బ్రహ్మం, ఆర్.పాంపల్లె

ఎదురు చూస్తున్నాం



డిగ్రీ వరకు చదువుకుని ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేక ఇంటివద్దనే ఉంటున్నాను. ప్రభుత్వం వెంటనే నిరుద్యోగ భృతి ఇవ్వడంతో పాటు జాబ్‌క్యాలెండర్‌ను ప్రకటించాలి. చదువుకు తగ్గ ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక గ్రామంలో కూలి పనులకు వెళ్లలేక తల్లిదండ్రులకు భారంగా మారడం బాధగా ఉంది.

–సాయికుమార్, శ్రీరంగాపురం

మాట నిలుపుకుంటారని ఆశిస్తున్నా



డిగ్రీ వరకు చదువుకున్నాను. పట్టణానికి వెళ్లి ఉద్యోగం కోసం శిక్షణ తీసుకునే ఆర్థిక స్థోమత లేదు. కుటుంబ సభ్యులకు భారం కాకూడదని పల్లెలోనే పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇస్తే కోచింగ్ సెంటర్ వెళ్లి శిక్షణ తీసుకుంటూ జాబ్ కోసం ప్రయత్నం చేస్తా. గతంలో మాదిరి మాట తప్పినట్లు ఈ సారి నిరుద్యోగ భృతికి అర్హులైన అందరికీ ఉద్యోగం వచ్చేవరకు ఇచ్చి మాట నిలుపుకుంటారని ఆశిస్తున్నా. చూద్దాం ఏం జరుగుతుందో.

–సాయిబాబా, రుద్రవరం

అమ్మవార్లకు సారె సమర్పణ



సుంకులాపరమేశ్వరికి సారెను సమర్పించడానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు



జగజ్జననీ మాతకు చీర, సారె తీసుకెళ్తున్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ ఆలయం, పప్పుల బట్టీ బజార్‌లో వెలసిన సుంకులాపరమేశ్వరికి మహిళలు ఆషాడమాసాన్ని పురస్కరించుకొని సోమవారం చీర, సారెను భక్తి శ్రద్ధలతో సమర్పించారు. వాసవీ మహిళా మండలి ఆధ్వర్యంలో సుంకులాపరమేశ్వరికి పురవీధులల్లో మేళతాళాలచే ఊరేగింపుగా తీసుకెళ్లి సారె సమర్పించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జగజ్జననీ ప్రతిమను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగింపుగా వచ్చి చీర, సారె అందజేశారు.

హోంమంత్రి వ్యాఖ్యలు సరికాదు

నంద్యాల(అర్బన్): హత్యాచారానికి గురైన బాలిక కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత ప్రకటించడం బాధాకరమని, ఆ మాటను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బోయ పులికొండన్న అన్నారు. సోమవారం వాల్మీకి మహిళలు, నాయకులతో సమావేశం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ బాలిక హత్యకు గురై రోజులు గడుస్తున్నా ఆచూకీ కనుగొనడంలో అధికారులు విఫలమయ్యారన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తే హత్యోదంతం బయటకు వస్తుందన్నారు. ప్రభుత్వం డబ్బులు ఇచ్చి చేతులు దులుపుకోవాలని చూస్తే ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. నాయకులు ఈశ్వరయ్య, శేఖర్, రవి, మహిళా నేతలు మల్లేశ్వరి, రమాదేవి, గుర్రమ్మ, లింగమ్మ, కవిత, సరస్వతి, అరుణ, సుజాత, మంగ పాల్గొన్నారు.

కౌలు గుర్తింపు కార్డులకు దరఖాస్తులు

శిరివెళ్ల: కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ కులశేఖర్ అన్నారు. సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు.. భూ యజమాని నుంచి కౌలు అగ్రిమెంట్ తీసుకున్న రైతులు దరఖాస్తులను వీఆర్వోలు, వ్యవసాయ సిబ్బందికి అందజేయాలన్నారు. భూ యజమాని పాస్ పుస్తకం జిరాక్స్, కౌలు రైతు బ్యాంక్ పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు, ఫొటోలను దరఖాస్తుకు జత చేయాలన్నారు. అనంతరం ఏఓ సుధాకర్ మాట్లాడుతూ.. గత ఏడాది మండలంలో 1011 మందికి కౌలు రైతు గుర్తుంపు కార్డులు జారీ చేశామని తెలిపారు. వీరు వ్యవసాయం చేస్తుంటే కార్డులను రెన్యూవల్ చేసుకోవాలని చెప్పారు. ఏటా 11 నెలల కాల వ్యవధితో గుర్తుంపు కార్డుల జారీ ఉంటుందన్నారు. గుర్తుంపు కార్డులున్న రైతులకు మాత్రమే ప్రభుత్వ సహాయం అందుతుందని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ నర్సిరెడ్డి, ఆర్‌ఐ సుచరిత పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్ కార్డులు

ఉయ్యాలవాడ: కౌలు రైతులందరికీ సీసీఆర్ కార్డులు అందజేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. మండలంలో 1,570 మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న 211 మంది రైతులకు సీసీఆర్ కార్డులు అందజేసినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం యజమానుల భూమి హక్కులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంటలపై మాత్రమే కౌలు దారునికి హక్కు ఉండేలా కౌలు రైతు చట్టాన్ని రూపొందించిందన్నారు. 11 నెలల కాలపరిమితితో కార్డులు అందజేస్తున్నట్లు తెలిపారు.



రుద్రవరంలో రైతు భరోసా కేంద్రం సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఏఓ

కౌలు కార్డుల జారీకి చర్యలు

రుద్రవరం: మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డుల జారీకి చర్యలు తీసుకుంటున్నామని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మురళీమోహన్ అధ్యక్షతన ఏఓ, ఆర్‌బీకే సిబ్బంది, వీఆర్వోలతో పంట సాగు హక్కు పత్రాలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. మండలంలో కౌలు వ్యవసాయం చేసే ప్రతి రైతు సీసీఆర్‌సీ కార్డులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్డులు ఉంటేనే ప్రభుత్వ రాయితీలు, ప్రయోజనాలు అందుతాయని చెప్పారు. పాస్‌బుక్కులు, ఆధార్‌కార్డు జిరాక్స్, రెండు ఫొటోలతో ఆర్బీకేలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

నంద్యాల(న్యూటౌన్): భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, సంక్షేమ పథకాలను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏసురత్నం, నాగరాజు మాట్లాడుతూ అర్హులైన భవన నిర్మాణ కార్మికులకు పెన్షన్ సౌకర్యం, పెండింగ్ క్లయిమ్‌లు పరిష్కరించాలని కోరారు. అనంతరం సంఘం కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశంలో వారు మాట్లాడుతూ కేరళ, తమిళనాడు, ఇతర రాష్ట్రాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, బాలవెంకట్, ఈరన్న పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లా స్థాయి ఫుట్‌బాల్‌పోటీలు

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్పీజీ మైదానంలో ఈనెల 17 నుంచి 19 వరకు క్రీడా భారతి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. పోటీల నిర్వహణపై క్రీడా భారతి జనరల్ సెక్రటరీ నిమ్మకాయల సుధాకర్, అధ్యక్షుడు వినయ్‌సాగర్ సోమవారం తమ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్రీడాభారతి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తూ క్రీడలను ప్రోత్సహిస్తున్నామన్నారు. క్రీడాకారులు జిల్లా స్థాయిలో పోటీల్లో ప్రతిభ కనబరచాలన్నారు.





దివిటీల వెలుగులో గుర్రంపై ఊరేగిస్తున్న అలీ అక్బర్ పీరు, తరలివచ్చిన భక్తులు

గుర్రంపై పీర్ల ఊరేగింపు

చాగలమర్రి: మొహర్రం వేడుకల్లో భాగంగా సోమవారం రాత్రి చిన్నమకానం వీధి కొలువదీర్చిన అలీ అక్బర్ పీరును వందలాది భక్తుల దివిటీల వెలుగులో గుర్రంపై సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. ఈ పీరును వివాహం కాని యువకులు ఊరేగించడం సంప్రదాయం. మేళతాళాల నడుమ చిన్న మకానంలో ప్రారంభమై లాల్ స్వామి మకానం మీదుగా పెద్దమకానం, మొయిన్ బజారు, పాతబస్టాండ్‌లోని నిర్వాహకుల ఇళ్ల వరకు ఊరేగింపు సాగింది. తిరిగి చిన్నమకానంలో కొలువుదీర్చారు. వందలాది మంది భక్తులు దీవిటీలను వెలిగించి స్వామి వెంట నడిచారు. దారి వెంట స్వామివారికి ప్రత్యేక ఫతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో ఫతేహాలు



క్రిష్టిపాడులో చావిడీలో కొలువైన పీర్లు

దొర్నిపాడు: మతసామరస్యానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం వేడుకల్లో భాగంగా చావిళ్లలో కొలువైన పీర్లకు భక్తిశ్రద్ధలతో ఫతేహాలు సమర్పించారు. సోమవారం మధ్యసరిగెత్తు సందర్భంగా క్రిష్టిపాడు, చాకరాజువేముల, దొర్నిపాడు, బుర్రారెడ్డిపల్లె, డబ్ల్యు గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపలలో ఘనంగా నిర్వహించారు.

వైభవంగా స్వాతి వేడుకలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, గంధాభిషేకం జరిపించి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం స్వాతి పల్లకీ సేవ ఆధ్వర్యంలో స్వామి వారికి పల్లకోత్సవం చేపట్టారు.

డిగ్రీ కళాశాలలో వరల్డ్ యూత్ స్కిల్‌డే

నంద్యాల(న్యూటౌన్): స్థానిక పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వరల్డ్ యూత్ స్కిల్‌డే నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ప్రతాపరెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులు కాలానుగుణంగా జరుగుతున్న మార్పులను గమనిస్తూ ఉపాధి కోసం తగిన శిక్షణ తీసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని సూచించారు. కళాశాల స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పార్వతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యను వ్యాపారంగా మార్చిన ప్రభుత్వం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యను అమలు చేయకుండా విద్యను వ్యాపారంగా మార్చిందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నాగరాజు అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యను ఇవ్వాల్సిన ప్రభుత్వం నూతన విద్యావిధానం పేరుతో వ్యాపారంగా మార్చిందని ఆరోపించారు. బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు విద్యను అందని ద్రాక్షలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. నరసింహ, బన్ని, సాయి, గణేష్ పాల్గొన్నారు.

హాకీ జట్టుకు ఎంపిక



లహరిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నంద్యాల(న్యూటౌన్): అండర్-17 సౌత్ జోన్ హాకీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టుకు పట్టణంలోని ఎస్పీజీ హైస్కూల్ విద్యార్థి లహరి ఎంపికైందని హెచ్‌ఎం జీవలత, హాకీ ఏపీ ప్రెసిడెంట్ చాణిక్యరాజు, సెక్రటరీ స్టీఫెన్ సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ కేరళలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు జరిగే సౌత్‌జోన్ హాకీ పోటీల్లో లహరి పాల్గొంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థినిని అభినందించారు.